వీధి నిద్రపోతూంది.

చీకటి కాపలా కాస్తోంది.

రాజుగారి తోటలో గజ్జి కుక్క 'కుయ్యో'మని మొరిగింది. నిద్రాభంగమవ్వడానికి అక్కడ రాజు గారు లేరు. రాజులు పోయారు. రాజ్యాలు పొయ్యాయి.

కొన్ని భవంతులు కార్యాలయాలయ్యాయి. రాజ ప్రాసాదాలు శిథిల శిల్పాలే అయ్యాయి. పూల తోటలు స్వేచ్ఛా వాయువుల్ని పీల్చుకుని విచ్చల విడిగా బలిసి అడవులే అయ్యాయి.

అందుచేత—

ఆ తోటను నాటించింది రాజుగారే అయినా ఆ రాజుగారిప్పుడు లేరు! ఉన్నది రాజులు గాడే!

రాజులు కళ్ళు విప్పేడు – గజ్జికుక్క అరుపు కర్ణకఠోరంగా వుంది. నేడో రేపో అన్నట్టుంది దాని స్థితి.

"వెధవది...ఇక్కడ చచ్చిందా....ఆ పీడంతా తనకే చుట్టుకుంటుంది. గోడ దాటి బయటకుపోతే యే మునిసిపాలిటీవాడో చూసుకుంటాడు."

నిశ్చింతగా నిద్రపోతున్నారిద్దరూ....

నిశ్చింత కాక? దొంగ భయమా? దొర భయమా? ఆ మాటకొస్తే దొంగభయం కంటే దొర భయమే ఎక్కువ.

"ఇదిగో నీ పేరేమిటోగానీ, రేపొద్దుటికి నీ పాక తీసేయకపోయావో....అగ్గిపుల్లెట్టెస్తాను - అనక చూద్దూగాని తమాషా."

ఉదయం జవాను అన్న మాటలు గుర్తొచ్చాయి. పాక పీకేయమన్నందుకు భయమేసినా, తన గూటిని 'పాక' అన్నందుకు నవ్వొచ్చింది రాజులికి.

మనసులోనే నవ్వుకున్నాడు - తనదే పాకంటే వూళ్లో వున్న పాకలన్నీ చిన్నబుచ్చుకుంటాయి. కాదు మరీ? రెండు కమ్మలు; నాలుగాకులు; మరో నాలుగు గోనె పట్టాలు.

అది పాకా? తనది పాకా? కాదు....కాదు రాజమందిరం!

పూల తోటలోని అందాల అద్దాల మందిరం.

ఆ మందిరంలో పగలు సూర్యుణ్ణీ, రాత్రి చంద్రుణ్ణీ, చుక్కల్నీ కూడా చూడొచ్చు.

అమావాశ్య అర్ధరాత్రినీ, మండుటెండల్నీ; తుఫాను ఉధృతాన్నీ, వర్షపాతాన్ని...అన్నీ చూడొచ్చు! ప్రకృతిలో పరవశించొచ్చు.

తన ఆలోచనలకి తనే నవ్వుకున్నాడు రాజులు. మర్రిచెట్టు మీద గుడ్లగూబ కూసింది—రాత్రి గడిచేందుకు మరో జాము వ్యవధి వుంది.

*

గుడ్లగూబ అరుస్తూనే వుంది. అల్లుతున్న తాటాకు బుట్ట అక్కడే వదిలేసి, లేచి చెట్ల సందుల్లోంచి ఆకాశంలోకి చూశాడు రాజులు. ఫ్లస్సుల్లాగా ఇంటూల్లాగా సూరీడు!

కాంతిరేఖలు చెట్ల ఆకుల పైనా, పూల రెమ్మల పైనా బంగారపుపూత పూస్తున్నాయి.


గుడ్లగూబ కన్పించలేదు.

ఎండుటాకులు శబ్దమైతే తలతిప్పి చూశాడు. ఒకరూ....ఇద్దరూ....ముగ్గురూ.

అబ్బో! చాలామందే!

# మార్పులేదు!

మాధవి సుంకర




చిరుగుల దుప్పటిని నిండా కప్పుకుని గుడిసెలోంచి ముందుకు వంగి ఒక మట్టి బెడ్డను దానిమీదికి విసిరాడు.

కుయ్యిమంటూ ఒక్క అరుపు అరిచి బరువుగా కదిలిపోయిందది.

మళ్ళీ నిద్రకుపక్రమించాడు రాజులు. గజ్జి కుక్క వెళ్లిపోయింది..నిద్ర కూడా వెళ్లిపోయింది.

ఉన్నవల్లా ఆలోచనలు! వెల్లికిలా పడుకుని మీదికి చూశాడు. గుడిసె కన్నాల్లోంచి చిక్కటి చీకటి అందవికారంగా కన్పిస్తోంది.

రాజులు గుండెలో వేయి ముళ్లు గుచ్చుకున్నట్లయింది. ఆ ఆలోచన అటువంటిది.

ఒక్కసారి ప్రక్కకు చూశాడు. సీతాలు నిబ్బరంగా నిద్రపోతుంది. సీతాలు ప్రక్కనే చంటాడు. ఏ పేరు పెడితే వాడు 'రాజా'లా బతగ్గలడో అనే ఆలోచన్లోనే యింతవరకూ వాడికి పేరే పెట్టలేదు.

సూట్లూ, బూట్లూ....ఇంజనీర్లే అయి వుండాలి!

వారం క్రితం వచ్చిన బాబులు చెప్పనే చెప్పారు. అడవిలా పెరిగిన రాజుగారి తోటనంతా నరికించి–శుభ్రం చేసి పార్కు చేస్తారంట. నగరంలో పార్కు లేని లోటు తీరుస్తారట. నిజమే....ఊరు పెరిగింది. పార్కుల్లేవు.

జనమంతా తమ జీవితాన్ని సగం ఆఫీసుల్లోనూ, మిగతా సగం, బస్సుల్లోనూ గడిపేస్తున్నారు.

వాళ్ళకి విశ్రాంతి యేది? విశ్రాంతికి పైమేది? చోటేది? అగ్గిపెట్టె లాంటి యిళ్ళు. వందలకు వందలూ అద్దెలు. ఒక్కచోట ఒకే గదిలో ఎందరో జీవులు.

ఆకాశం....భూమీ....గాలీ......నీరూ....అందరిదీనూ.

మరి యిదేమిటి?

అడుగులు దగ్గరపడ్డాయి. పెద్ద దొరే!

ఆకాశం రంగు సూట్లో వున్నాడు. అరముగ్గిన జామిపండులా వున్నాడు. రావడంలోనే ఇంగ్లీషులో యేదో గర్జించాడు.

"ఎవరు నువ్వు? ఎన్నాళ్ల నుంచి వుంటున్నా విక్కడ? దొరగారు అడుగుతున్నారు" చిన్న దొర, తెలుగు దొర. తెలుగులో అడిగేడు.

"రాజులంటారండి నన్ను .... సాలాకాలం నుంచి యిక్కడ్నే వుంటున్నాం" నసిగేడు రాజులు.

"ఏం చేస్తుంటావ్"

"ఏదో కడుపు నిండని పని బాబయ్యా. బుట్టలు అల్లుతా" చిన్న దొర ఇంగ్లీషులో అదేమాట పెద్ద దొరతో చెప్పాడు.

పెద్ద దొర మళ్ళీ ఇంగ్లీషులో ఏదో అరిచాడు. చిన్న దొర తెలుగులో కసురుకున్నాడు.

"ఏమిటి? బుట్టలల్లే బతికేస్తున్నావా? అదే నిజమైతే ఇక్కడి కర్రా, కలపా, పూలు, పళ్ళూ ఏమవుతున్నాయ్?".

రాజులు ఏదో చెప్పబోయాడు. కానీ అక్కడున్న వారిలో ఒకరి కళ్ళెర్రబడ్డంతో కాస్త తడబడ్డాడు.

"బుట్టల్తోపాటు సూదులూ, పూసలు కూడా రోడ్డుమీదెట్టి అమ్ముకుంటా బాబయ్యా! ఎప్పుడేనా కాయా, కసరూ రాలితే తిండమే గానీ మరేటీతెల్దు."

"నీకు తెలుసో లేదో యిది ప్రభుత్వం ఆస్తి. ఎవరూ యిక్కడ వుండటానికి వీలు లేదు.... తక్షణం నువ్వు ఖాళీ చేసెయ్యాలి. తెల్సిందా?"

చిన్నదొర మాటలకు దిగులు గుండెల్తో తలూపాడు రాజులు.

"ఇంకా నీలాంటి వారెవరైనా వుంటున్నారా యిక్కడ?"

"చిత్తం మరో నాలుగైదు కుటుంబాలున్నాయి"

బూట్లు కదిలాయి.

*

చూపుడు వేళ్ళమీదున్న చుక్కల్ని వెన్నెల వెలుగుతో చూసుకున్నారు రాజులు, సీతాలు.

ఓట్లేస్తే అలా చుక్క వేస్తారని వాళ్ళకి తెల్సిందా రోజే....మునుపెవరూ ఆ తోటలోకి వచ్చే వారు గాదు....ఓట్లెయ్యమని బలవంత పెట్టేవారూ కాదు. అందుకే తెలీదిన్నాళ్ళూ....

ఇప్పుడా తోట నరికి మాన్లు లారీల మీద తీసుకుపోయారు.

అడవి అల్లకల్లోలమైంది....

రాజుల గూడు వీధిన పడింది.

టాపు పాతదే. కాని నేల మాత్రం మట్టిది కాదు....సిమ్మెంటుది. కాకపోతే అప్పటికీ ఇప్పటికి ఆధారమైన గోడ ఒక్కటే.

పూర్వం ఆ గూటికి బుడ్డిదీప మొక్కటే.... ఇప్పుడు ఎలక్ట్రిక్ వీధి దీపముంది.

*

మైకులూ....కేకలూ ఎక్కడ చూసినా జనం, జనం....!

ఏ నోట విన్నా ఒకే మాట....ఎవరు చర్చించినా అదే సంగతి....

"ఏలికలు మారేరు" - అన్నదే అర్థమైంది రాజులికి.

ఇసకేస్తే రాలనంత జనం....శిబిరంలో....రాజు గారి పూల తోటలో నేల కనబడకుండా రాలిన ఎండుటాకుల్లా జనం! చోద్యాన్ని చూస్తూ నిలబడ్డాడు రాజులు....ఎందుకో ఆనందమనిపించింది... వాళ్ళతోపాటు తనూ కేక వెయ్యాలనిపించింది.

జై....జై లు పలకాలనిపించింది.

కానీ....కానీ జన ప్రవాహం కదిలిపోయింది.

వెనక కార్ల బారు!

"ఎన్ని ప్రభుత్వాలు మారినా ఏం లాభం.... యీ డర్టీబెగ్గర్స్ మారరు. అందమైన ఈ పార్కు గోడ చుట్టూ యీ గుడిసెలేమిటి చండాలంగా...." కారులో వున్న లావుపాటి పెద్దమనిషి అన్నమాట బాణంలా గుచ్చుకుంది రాజులి గుండెల్లో.

"డర్టీబెగ్గర్స్" అన్న మాటకు అర్థం తెలీలేదు పాపం పూర్ రాజులికి. □



కె. జమునారాణి

ఒక విషయాన్ని సూటిగా, అందరికీ అర్థమయ్యేలా విశదీకరించి చెబుతూ, విమర్శనాత్మకంగా కూడా వుండేలా రాయగలిగిన ప్రక్రియ - వ్యాసం. రచనా వ్యాసంగంలో ఒక భాగం అయిన వ్యాస రచనలో పోటీ పెట్టినప్పుడు ఆ పోటీలో అందరికన్న మిన్న అనిపించుకుని గెలుపొందడం చెప్పుకోదగ్గ విశేషమే. అటువంటి ఘనత సాధించిన వనిత కుమారి కోగంటి జమునారాణి. మద్రాసులోని ప్రముఖ సాంస్కృతిక సంస్థ 'కళాసాగర్' ఇటీవల నిర్వహించిన వ్యాస రచన పోటీలలో ఆమె గెలుపొంది వారి 'లిటరరీ అవార్డు'ను పొందింది.

ప్రస్తుతం మద్రాసులోని ఎస్. ఐ. ఇ. టి, కళాశాలలో బి. ఏ (ఎకనామిక్స్) రెండవ సంవత్సరం చదువుతున్న జమునారాణి గత సంవత్సరం అంతర్ కళాశాల క్విజ్ పోటీలో ప్రథమ బహుమతి పొందింది. హిందీ విశారదకు చదువుతున్న ఈమె రష్యన్ భాష కూడా నేర్చుకుంటున్నది. టైప్‌రైటింగ్, కుట్లు, అల్లికలలో బాగా ప్రవేశమున్న జమునారాణికి జర్నలిజంలో రాణించాలని ఆసక్తి.